# భారతదేశ చరిత్ర

## మత సంస్కరణోద్యమాలు

**పంతొమ్మిదో శతాబ్దంలో ఆధునిక ఆంగ్ల విద్యావ్యాప్తి, క్రైస్తవ మిషనరీల మత ప్రచారం, ఐరోపాలో ప్రారంభమైన ఉదార, హేతువాద, మానవతా ఉద్యమాలు తమ సామాజిక, మత వ్యవస్థల గురించి భారతీయులు పునరాలోచించేలా చేశాయి. ఈ ప్రభావంతో తలెత్తిన సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు భారతీయుల జీవన విధానాన్ని మార్చాయి. వారిలో ఐకమత్యాన్ని, దేశభక్తిని పెంపొందించాయి.**

భారత స్వాతంత్ర్యోద్యమం మొదట బెంగాల్‌లో, తర్వాత పశ్చిమ భారతదేశంలో ప్రారంభమైంది. భారతదేశంలో పునరుజ్జీవన ఉద్యమ పితగా రాజా రామమోహన్‌రాయ్‌ను పేర్కొంటారు.

- బ్రహ్మ సమాజం: బ్రహ్మ సమాజ స్థాపకుడైన రాజా రామమోహన్‌రాయ్ 1772 లో బెంగాల్‌లోని బర్ద్వాన్ జిల్లా రాధానగర్‌లో జన్మించారు. ఈయన 1815 లో ఆత్మీయసభ అనే సంస్థను స్థాపించారు. భగవంతుడు ఒక్కడే అనే సిద్ధాంతాన్ని ప్రచారం చేయడమే దీని లక్ష్యం. ఆ తర్వాత 1828 లో బ్రహ్మ సమాజాన్ని ప్రారంభించారు. హిందూ మతంలోని దురాచారాలను రూపుమాపడం, సంస్కరించడం దీని ఉద్దేశం.
- రాజా రామమోహన్‌రాయ్ ఆధునిక విద్యా వ్యాప్తి కోసం విశేష కృషి చేశారు. ఈయన మరణం తర్వాత దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవ చంద్రసేన్ బ్రహ్మ సమాజ వ్యాప్తి కోసం పాటుపడ్డారు.
- దేవేంద్రనాథ్ ఠాగూర్ 1831 లో కోల్‌కతా (కలకత్తా)లో తత్వబోధిని సభను స్థాపించారు. 1843 లో బ్రహ్మ సమాజంలో చేరి, బెంగాలీ భాషలో 'తత్వ బోధిని' అనే పత్రికను ప్రారంభించారు.
- 1857 లో బ్రహ్మ సమాజంలో చేరిన కేశవ చంద్రసేన్ దేవేంద్రనాథ్ ఠాగూర్ కుడి భుజంగా పేరుపొందారు. అయితే కులాంతర వివాహాలు, వితంతు పునర్వివాహాలు, పరదా పద్ధతి తొలగింపు లాంటి కార్యక్రమాలు పాతతరం వారికి నచ్చలేదు. దీంతో బ్రహ్మ సమాజంలో చీలిక ఏర్పడింది.
- మన్నవ బుచ్చయ్య పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు మొదలైనవారు దక్షిణ భారతదేశంలో బ్రహ్మ సమాజ వ్యాప్తికి ఎంతగానో కృషి చేశారు.

### ఆర్య సమాజం

ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి. ఈయన అసలుపేరు మూల్‌శంకర్. ఈయన 1824 లో గుజరాత్‌లోని మోర్వి సమీపంలో ఉన్న టంకారా అనే ప్రదేశంలో జన్మించారు. దయానందుడు ఉత్తర్ ప్రదేశ్‌లోని మధురలో విరజానందుడు అనే అంధ సన్యాసి వద్ద వేదాలు, ధర్మశాస్త్రాలు, స్మృతులను అభ్యసించారు.

- దయానందుడు 1875 ఏప్రిల్ 10 న బొంబాయిలో ఆర్యసమాజాన్ని స్థాపించారు. 'వేదాలకు తిరిగి వెళదాం' అనేది ఈయన నినాదం. తర్వాతి కాలంలో పంజాబ్‌లోని లాహోర్ ఆర్య సమాజ ప్రధాన కేంద్రంగా మారింది.
- దయానందుడు 1882 లో గోరక్ష ఉద్యమాన్ని చేపట్టారు. ఇతర మతాల్లో చేరిన హిందువులను తిరిగి హిందూ మతంలోకి తీసుకురావడానికి దయానంద సరస్వతి శుద్ధి ఉద్యమాన్ని ప్రారంభించారు.

### రామకృష్ణ మిషన్, రామకృష్ణ మఠం

వివేకానందుడు 1897 లో పశ్చిమ్ బంగ (పశ్చిమ బెంగాల్)లోని బేలూరు కేంద్రంగా రామకృష్ణ మిషన్‌ను స్థాపించారు. సమాజ సేవ చేయడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ మిషన్ అనేక పాఠశాలలు, కళాశాలలు, వైద్యశాలలు, అనాథ శరణాలయాలను స్థాపించి, పేద ప్రజలకు సహాయం అందిస్తోంది.

- 1887 లో వివేకానందుడు పశ్చిమ్ బంగలోని బారానగర్‌లో రామకృష్ణ మఠాన్ని స్థాపించారు. తన గురువైన రామకృష్ణ పరమహంస బోధనలను ప్రచారం చేయడానికి దీన్ని ప్రారంభించారు.
- 1898 నుంచి రామకృష్ణ మిషన్, రామకృష్ణ మఠం రెండింటికీ బేలూరు ప్రధాన కేంద్రమైంది.
- రామకృష్ణ అసలు పేరు గదాధర చటోపాధ్యాయ. ఈయన 1836 లో పశ్చిమ్ బంగలోని హుగ్లీ జిల్లా కామర్‌పుకుర్ అనే గ్రామంలో జన్మించారు. మానవసేవే మాధవసేవ అనేది రామకృష్ణుడి నినాదం.

### స్వామి వివేకానంద

వివేకానందుడి అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా. ఈయన 1863 లో కలకత్తాలో జన్మించారు. వివేకానందుడు 1881 లో మొదటి

సారి రామకృష్ణ పరమహంసను కలుసుకున్నారు. ఈయన భారతదేశం మొత్తం కాలినడకన ప్రయాణించి, ప్రజల వాస్తవ స్థితిగతులను తెలుసుకున్నారు.

- 1893 లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల సదస్సుకు హాజరైన వివేకానందుడు హిందూమత ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పారు. ఈయన అనారోగ్యం కారణంగా అతిచిన్న వయసులో (1902) మరణించారు.
- వివేకానందుడు మానవులందరిలో దైవత్వం ఉందనీ, ప్రతి వ్యక్తిలో శక్తిసామర్థ్యాలు ఉన్నాయని, ఎవ్వరినీ తక్కువగా చూడరాదని బోధించారు.
- 'నీవు భారతీయుడవని గర్వించు. ప్రతి భారతీయుడు నా సోదరుడని సగర్వంగా ప్రకటించు'అని పేర్కొన్నారు.

## దివ్యజ్ఞాన సమాజం

రష్యాకు చెందిన హెచ్.పి. బ్లావట్ స్కీ, అమెరికాకు చెందిన హెచ్.ఎస్. ఆల్కాట్ 1875 లో న్యూయార్క్‌లో దివ్యజ్ఞాన సమాజాన్ని స్థాపించారు. 1879 లో భారతదేశానికి వచ్చిన ఈ ఇద్దరూ 1882 లో మద్రాసు సమీపంలోని అడయారు వద్ద దివ్యజ్ఞాన సమాజం ప్రధాన కార్యాలయాన్ని నెలకొల్పారు.

- ఐర్లాండ్‌కు చెందిన అనిబిసెంట్ లండన్‌లోని దివ్యజ్ఞాన సమాజంలో సభ్యురాలిగా చేరారు. ఈమె 1893 లో భారతదేశానికి వచ్చారు. 1907 లో ఆల్కాట్ మరణం తర్వాత దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షురాలయ్యారు.
- విశ్వమానవులందరిలో సోదర భావాన్ని పెంపొందించడం, ప్రాచీన మతాల అధ్యయనాన్ని ప్రోత్సహించడం ఈ సమాజ ప్రధాన లక్ష్యాలు.
- 1898 లో అనిబిసెంట్ హిందూ మత సూత్రాలను బోధించడానికి వారణాసిలో సెంట్రల్ హిందూ స్కూల్‌ను ప్రారంభించారు. ఆ తర్వాతి కాలంలో మదన్‌మోహన్ మాలవీయ కృషి ఫలితంగా ఈ స్కూల్ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంగా (1916) అభివృద్ధి చెందింది.
- **అలీగఢ్ ఉద్యమం:** ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. హేతు వాదం ప్రాతిపదికగా ఇస్లాం మతాన్ని సమర్థిస్తూనే, ముస్లిం సమాజంలోని బహు భార్యత్వాన్ని, బానిస వ్యవస్థను విమర్శించారు.
- ముస్లింలకు ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో 1875 లో అలీగఢ్‌లో మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాలను స్థాపించారు. ఇది 1920 లో అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందింది.

## సాంఘిక సంస్కరణ ఉద్యమాలు

సంఘ సంస్కర్తలు ప్రధానంగా ఆ కాలంలోని దురాచారాలైన బాల్య వివాహాలు, బహు భార్యత్వం, సతీసహగమనం, దేవదాసి విధానం, అంటరానితనాన్ని రూపుమాపడానికి కృషి చేశారు.

- రాజా రామమోహన్‌రాయ్ కృషి ఫలితంగా 1829 లో అప్పటి వైస్రాయ్ విలియం బెంటింక్ సతీసహగమన నిషేధ చట్టాన్ని రూపొందించారు.
- బెంగాలీలు, రాజపుత్రుల్లో బాలికలను చిన్నప్పుడే చంపేసే దురాచారం ఉండేది. 1795 లో రూపొందించిన బెంగాల్ రెగ్యులేషన్ XXI చట్టం, 1804 లో చేసిన రెగ్యులేషన్ III చట్టం ఈ దురాచారం చట్ట విరుద్ధమైందని ప్రకటించాయి.
- పండిట్ ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వితంతు పునర్వివాహాల కోసం పోరాడారు. ఈయన కృషి ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం 1856 లో హిందూ వితంతు పునర్వివాహ చట్టాన్ని రూపొందించింది.
- విద్యాసాగర్ బాల్యవివాహాలను, బహు భార్యత్వాన్ని వ్యతిరేకించారు. స్త్రీ విద్య కోసం ప్రచారం చేశారు.
- మహారాష్ట్రలో డి.కె. కార్వే, ఆంధ్రరాష్ట్రంలో కందుకూరి వీరేశలింగం పంతులు వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారు.
- వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో వీరేశలింగం 1878 లో రాజమండ్రి సాంఘిక సంస్కరణ సంస్థను స్థాపించారు.
- కార్వే 1899 లో పుణెలో వితంతు సదన్‌ను స్థాపించారు. 1916 లో భారతదేశంలో మొట్టమొదటి మహిళా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు.
- లోకహితవాదిగా ప్రసిద్ధి చెందిన గోపాల హరిదేశ్‌ముఖ్ మహారాష్ట్రలో సంఘ సంస్కరణకు నాందిపలికారు.

- మహాదేవ గోవింద రనడే ప్రార్థనా సమాజంలో ప్రముఖ సభ్యుడు. ఈయన స్ఫూర్తితోనే గోపాల గణేష్ అగార్కర్ 1884 లో పుణెలో దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించారు. రనడేను గోపాల కృష్ణ గోఖలే తన గురువుగా పేర్కొన్నారు.
- జ్యోతిబా పూలే అగ్రవర్ణాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారు. ఈయన 1873 లో సత్యశోధక సమాజాన్ని స్థాపించి, స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారు.
- 1905 లో గోపాలకృష్ణ గోఖలే బొంబాయిలో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని స్థాపించారు. మాతృభూమికి సేవ చేయడానికి వీలుగా భారతీయులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.
- 1872 లో రూపొందించిన స్వదేశీ వివాహ చట్టం కనీస వివాహ వయసు బాలికలకు 14 ఏళ్లు, బాలురకు 18 ఏళ్లుగా నిర్ణయించింది. అయితే ఈ చట్టం హిందువులు, ముస్లింలు, ఇతర గుర్తింపు పొందిన మతాల వారికి వర్తించకపోవడంతో పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయింది.
- పార్శీ సంఘ సంస్కర్త బి.ఎం. మలబారి కృషి వల్ల 1891 లో Age of Consent Act ను రూపొందించారు. ఈ చట్టం 12 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న బాలికలకు వివాహం చేయడాన్ని నిషేధించింది.
- 1849 లో జె.ఇ.డి. బెత్యూన్ కలకత్తాలో బాలికల పాఠశాలను స్థాపించారు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కూడా కలకత్తాలో 35 బాలికల పాఠశాలలను ఏర్పాటుచేశారు.
- గాంధీజీ దిల్లీలో హరిజన్ సేవక్ సంఘ్ అనే సంస్థను స్థాపించి, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేశారు.
- 1945 లో అంబేద్కర్ 'అంటరాని వారికోసం కాంగ్రెస్, గాంధీ చేసిందేమిటి? ' అనే గ్రంథాన్ని రచించారు. దళితులు హిందూ మతాన్ని విడిచిపెట్టి, బౌద్ధాన్ని స్వీకరించాలని ఆయన సూచించారు.

## మాదిరి ప్రశ్నలు

1. క్రైస్తవ మత ప్రచారకుడైన అలెగ్జాండర్ డఫ్ చేసిన హిందూమత వ్యతిరేక ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టింది ఎవరు?

   ఎ) దేవేంద్రనాథ్ ఠాగూర్ బి) కేశవ చంద్రసేన్
   సి) దయానంద సరస్వతి డి) రాజా రామమోహన్‌రాయ్

2. 'గులాంగిరీ' గ్రంథ రచయిత ఎవరు?

   ఎ) అంబేద్కర్ బి) గాంధీజీ సి) జ్యోతిబా పూలే డి) గోఖలే

3. శుద్ధి ఉద్యమాన్ని ప్రారంభించింది ఎవరు?

   ఎ) రాజా రామమోహన్‌రాయ్ బి) వివేకానందుడు
   సి) దయానంద సరస్వతి డి) కేశవ చంద్రసేన్

4. యంగ్ బెంగాల్ ఉద్యమ స్థాపకుడు ఎవరు?

   ఎ) ఎం.జి. రనడే బి) ఆనంద మోహన్ బోస్
   సి) హెన్రీవివియన్ డిరోజియో డి) ఎవరూకాదు

5. ఆర్యసమాజ ప్రభావం ఏ రాష్ట్రంపై ఎక్కువగా ఉంది?

   ఎ) ఆంధ్రప్రదేశ్ బి) మహారాష్ట్ర
   సి) పంజాబ్ డి) గుజరాత్

6. రామకృష్ణ పరమహంస భార్య పేరేమిటి?

   ఎ) శారదా ప్రియ బి) శారదా మణి సి) శ్రీలత డి) పార్వతి

**జవాబులు**

1-ఎ; 2-సి; 3-సి; 4-సి; 5-సి; 6-బి.

**- భాస్కర్ వేడియం**